

బంగారురథమెక్కి భగవంతుడొచ్చాడు!

అదిగో చూడరో.. అందరు మొక్కరో!

బ్రహ్మోత్సవాల 6వ రోజు సాయంత్రం బంగారు రథంపై తిరుమల స్వామి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించాడు. ఉభయ దేవేరుల సరసన శ్రీవారి చిద్విలాస యాత్ర వేలాది మంది భక్తుల గోవిందల నడుమ వైభవంగా సాగింది. ఉదయం హనుమంతుడే స్వామికి వాహనంగా మారాడు. బంగారు విల్లు ధరించి శ్రీరాముడి అవతారంలో శ్రీనివాసుడు ఊరేగాడు.

రాత్రి గజవాహనసేవకూ భక్తులు పోటెత్తారు. వెంకన్న స్వామికి అంకితమైన ఆలయ గజాలు లక్ష్మి, మహాలక్ష్మి, పద్మజ, పద్మావతి ముందు నడవగా గజవాహనం మాడవీధుల్లో కదిలింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి వచ్చిన 18 కళాబృందాల నృత్య గానాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెలుగు ఏపీఎం కుర్చీలో ఇద్దరు!

గంగాధరనెల్లూరు, అక్టోబరు 9 : గంగాధరనెల్లూరు వెలుగు కార్యాలయంలోని ఏపీఎం సీటులో ఇద్దరు కొనసాగుతున్న వైనమిది.సాధారణ బదిలీల్లో భాగంగా పాలసముద్రంలో ఏపీఎంగా పనిచేస్తున్న ఫరీద్‌మస్తాన్ గంగాధరనెల్లూరుకు బదిలీఅయ్యారు. బుధవారం ఉదయం 10గంటలకు ఫరీద్‌మస్తాన్ తాను విధుల్లో చేరినట్లు డీఆర్‌డీఏ అధికారులకు మెయిల్ పంపారు.డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘ మిత్రలతో వారికి అందిన బ్యాంక్ లింకేజి రుణాలు, స్త్రీనిధి రుణాలపై ఆరా తీశారు. టీడీపీ నేతలు వెంకటేష్, స్వామిదాస్, దేవసుందరం ఆయన్ను కలసి శుభాకాంక్షలు కూడా చెప్పారు.అయితే ఆ సీటులో కొనసాగుతున్న చిరంజీవి బుధవారం మధ్యాహ్నం ఆఫీస్‌కు వచ్చారు.ఏపీఎం చాంబర్‌లోని కుర్చీలో సాయంత్రం వరకు కంప్యూటర్ ముందు కూర్చుండిపోయారు.దీంతో డ్వాక్రా లీడర్లు, సంఘమిత్రలు, వెలుగు సీసీలు ఎవరిని ఏపీఎంగా గౌరవించాలో తెలియక ఆందోళనకు గురయ్యారు.ఫరీద్‌మస్తాన్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చిన జిల్లా అధికారులు అంతకు ముందు పనిచేస్తున్న చిరంజీవిని బదిలీ చేసి ఉండాలి, లేకపోతే డీఆర్‌డీఏ ఆఫీస్‌లో రిపోర్టు అయినా చేసుకోవాల్సిందిగా ఆదేశించివుండాలి. అదేం లేని కారణంగానే ఇద్దరు ఏపీఎంలు ఒకే కుర్చీకి పోటీ పడాల్సివచ్చింది.కొత్త ఏపీఎం ఫరీద్ మస్తాన్ తనకందిన బదిలీ ఉత్తర్వుల మేరకు విధుల్లో చేరానని, చిరంజీవికి బదిలీ ఉత్తర్వులు రాకపోతే ఆ విషయమై జిల్లా అధికారులను సంప్రదించి ఉంటే బాగుండేదంటున్నారు.ఏపీఎం చిరంజీవి మాత్రం తనను బదిలీ చేయకపోవడంతో ఇక్కడే విధుల్లో ఉన్నానన్నారు. తాను రిలీవ్ కాకముందే కొత్త ఏపీఎం విధుల్లో ఏవిధంగా చేరగలరని ప్రశ్నిస్తున్నారు.



విధుల్లో చేరిన ఫరీద్‌మస్తాన్‌కు టీడీపీ నేతల సన్మానం



ఏపీఎం చాంబర్‌లో చిరంజీవి

వాగ్దేవి రూపంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, అక్టోబరు 9 : దసరా ఉత్సవాల్లో బోయకొండ గంగమ్మ బుధవారం సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో వీణ, ఒక చేతిలో వేదాలు, మరో చేతిలో రుద్రాక్షమాలతో అర్చకులు అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.యాగశాల వద్ద ఉత్సవ మూర్తిని అలంకరించి ఉభయదారులచే అమ్మవారి మూల మంత్రాన్ని పఠింపజేస్తూ సరస్వతీదేవి విశిష్టతను వివరించారు. మహా గణపతి, ఆదిత్యాధి నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర, రుద్ర , సరస్వతీదేవి హోమాలు నిర్వహించారు.చౌడేపల్లెకు చెందిన విజయవాణి ప్రింటర్స్ యాజమానులు, పద్మజ, మోహన్‌బాబు, కొలింపల్లెకు చెందిన గగన్‌యాదవ్, నందన్ యాదవ్, స్కందన్‌యాదవ్, చార్విక, జాహ్నవిక, మిట్టూరుకు చెందిన శంకరమ్మ, రెడ్డప్ప, బి.కొత్తకోటకు చెందిన శ్రీదేవి, శ్రీకాంత్, మదనపల్లెకు చెందిన తిరుమల, భాస్కర్, బెంగళూరుకు చెందిన వరలక్ష్మమ్మ, శ్రీనివాసులు, రాయచోటికి చెందిన మాధవీలత, పల్లె రమేష్ ఉభయదారులుగా వ్యవహరించారు.ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈవో ఏకాంబరం వారికి అమ్మవారి ఫొటో,తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ..గంగమ్మ ఆలయాన్ని రూ.వందల కోట్లతో తాము అభివృద్ధి చేశామని, టీడీపీ కూడా అంతకు మించి అభివృద్ధి చేయాలన్నారు.బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ నాగరాజరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర రెడ్డి, జడ్పీటీసీ దామోదర రాజు తదితరులు పాల్గొన్నారు.





సరస్వతీదేవి అలంకారంలో గంగమ్మ - హోమంలో పాల్గొన్న ఉభయదారులు

డీఎఫ్‌వో బాధ్యతల స్వీకారం



ఎస్.భరణి

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 9: జిల్లా అటవీశాఖ అధికారిణిగా ఎస్.భరణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న చైతన్య కుమార్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలోకి ఐఎఫ్ఎస్ 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్.భరణిని ప్రభుత్వం నియమించింది. భరణికి ఈస్టు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.బాధ్యతలు స్వీకరించాక కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా భరణి కలిశారు.

గంటా మోహన్‌పై సస్పెన్షన్ వేటు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 9: సర్వీసు రూల్స్‌ను అతిక్రమించినందుకు బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గంటా మోహన్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈవో దేవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా ప్రెస్‌మీట్ పెట్టి డీఈవోపై అసత్య ప్రచారం చేయడం, దీనిపై ఇచ్చిన మెమోకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

16నుంచి నూతన మద్యం దుకాణాలు:ఈఎస్

చిత్తూరు సిటీ, అక్టోబరు 9:మద్యం దుకాణాల దరఖాస్తుకు ప్రభుత్వం ఈ నెల 11వ తేది వరకు గడువు పొడిగించిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 104 మద్యం దుకాణాలకు 1570 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.గడువును పొడిగించిన నేపథ్యంలో 14వ తేది ఉదయం 8 గంటలకు చిత్తూరు - కాణిపాకం రోడ్డులోని సంతపేటలో ఉన్న ఆర్ఆర్ గార్డెన్స్ (మాణిక్యమ్మ ఫంక్షన్ హాల్)లో లాటరీ నిర్వహిస్తారని చెప్పారు. దరఖాస్తు దారులు ఉదయం 7 గంటలకు హాజరవ్వాలని చెప్పారు. దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయిస్తారని, 16వ తేది నుంచి నూతన దుకాణాలు ప్రారంభమవుతాయని ఈఎస్ చెప్పారు.

సీఎంసీ ఆధ్వర్యంలో మరో వైద్య కళాశాల

గుడిపాల, అక్టోబరు 9: గుడిపాల సమీపంలోని 190రామాపురం వద్ద వున్న సీఎంసీ ఆస్పత్రి క్యాంపస్‌లో కొత్త మెడికల్ కాలేజ్, టీచింగ్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనురాగ్ బెహర్, సీఎంసీ డైరెక్టర్ డాక్టర్ విక్రమ్ మాథ్యూస్ తెలిపారు. బుధవారం సీఎంసీ ఆస్పత్రి క్యాంపస్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన వారికి వైద్యవిద్యను అందించేందుకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో సీఎంసీ భాగస్వామ్య ఒప్పందాన్ని ప్రకటించారు. అందులో భాగంగా మెడికల్ కాలేజ్‌ను ఏర్పాటు చేయడానికి, ఇప్పటికే వున్న 120 పడకల ఆస్పత్రిని 402 పడకలతో బోధనాస్పత్రిగా విస్తరించడానికి వేలూరు సీఎంసీకి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ రూ.500 కోట్లు గ్రాంట్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ గ్రాంట్ సీఎంసీ వైద్యవిద్యకు సంబంధించి విలక్షణమైన అంశాల్లో విస్తరించడానికి, భారతీయ ఆరోగ్య సంరక్షణ రంగంలో విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరించడానికి వీలు కల్పిస్తుందన్నారు.సీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సోలమన్, సతీష్ కుమార్, పీఆర్వో ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.



అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, సీఎంసీ ప్రతినిధులు

ఏర్పేడు ఎస్‌ఐ సస్పెన్షన్



ఎస్‌ఐ రహీంరెడ్డి

తిరుపతి(నేరవిభాగం)/ఏర్పేడు, అక్టోబరు 9: ఏర్పేడు ఎస్‌ఐగా 20 రోజుల కిందట బాధ్యతలు చేపట్టిన రహీంరెడ్డి సస్పెండయ్యారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక, మట్టి అక్రమార్కుల నుంచి ఎస్‌ఐ అవినీతికి పాల్పడ్డారని ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. కొత్త వీరాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నాడు. ఇతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోకుండా రూ.పది వేలు వసూలు చేసినట్లు... అలాగే కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వారి నుంచీ నగదు తీసుకున్నట్లు ఎస్పీకి ఫిర్యాదులు వచ్చాయి. ఇలా అనతికాలంలోనే ఆయనపై పలు అవినీతి, అక్రమాలకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో ఎస్పీ స్పందించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తిని విచారణాధికారిగా నియమించారు. విచారణ నివేదిక మేరకు ఎస్‌ఐ రహీంరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, అక్రమ వసూళ్లను సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. కాగా, రహీంరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూములపై నివేదికలు నేడు అందించండి : జేసీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 9: జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికను గురువారంలోగా అందించాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం జేసీ ఛాంబర్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలసి మండలాలవారీగా ఫ్రీహోల్డ్ భూముల అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సీసీఎల్ఏ ద్వారా మండలానికి అందిన ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ చేసిన భూముల విస్తీర్ణం, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర అంశాలను ప్రొఫార్మాలో పూరించి అప్‌డేట్ చేయాలన్నారు. ఒకవేళ ఫ్రీహోల్డ్ భూముల్లో కోర్టు కేసులు, డబుల్ ఎంట్రీలు ఉంటే, వాటిని ప్రొఫార్మాలోని రిమార్క్స్ కాలమ్‌లో నమోదు చేయాలన్నారు. ఫ్రీహోల్డ్‌లో వున్న భూముల సర్వే నెంబర్లు, అనుభవంలో వున్న వారి వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవోలు శ్రీనివాసరాజు, వెంకట రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 9: అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 11 మండలాల్లో వర్షం కురిసింది.సోమలలో 56.4మి.మీ, గంగవరంలో 13.6, చిత్తూరులో 10.2, బైరెడ్డిపల్లిలో 8.6, బంగారుపాళ్యంలో 8.2, పలమనేరులో 6.4, శ్రీరంగరాజపురంలో 4, శాంతిపురంలో 3.6, పులిచెర్లలో 2, కార్వేటినగరంలో 1.6, పెద్దపంజాణిలో 1.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

'కొండ'ంత భక్తజనం

- ఐదేళ్ల తర్వాత గరుడ సేవకు భారీ రద్దీ
- 2.7 లక్షలమందికి వాహన దర్శనం
- టీటీడీ ముందస్తు ప్రణాళిక, పటిష్ట చర్యలతో విజయవంతం



తిరుమలలో ఐదేళ్ల తర్వాత అసలైన గరుడోత్సవ రద్దీ కనిపించింది. 'కొండ'పై ఎటు చూసినా భక్తజనమే కనిపించారు. ఈ రద్దీని ఊహించిన టీటీడీ ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఫలితం.. మంగళవారం నాటి గరుడోత్సవం విజయవంతంగా ముగిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజుల్లో గరుడవాహనానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరవడం పరిపాటి. 2019 బ్రహ్మోత్సవాలలో గరుడ సేవకు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఇక, కొవిడ్ నేపథ్యంలో 2020, 2021లో బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించారు. 2022లోనూ కొవిడ్ భయంతో చాలా మంది వాహనసేవలకు దూరంగానే ఉన్నారు. గతేడాది ఎన్నికల ముందు కావడంతో పాటు వైసీపీ ప్రభుత్వం వీఐపీలకే ప్రాధాన్యం కల్పిస్తోందనే అభిప్రాయాలతో రద్దీ సాధారణంగానే కనిపించింది. ఈ ఏడాది ప్రభుత్వం మారాక భక్తులు భారీగా వచ్చే అవకాశాలున్నాయన్న అంచనాతో టీటీడీ పటిష్ఠ ఏర్పాట్లు.. తదనుగుణంగా సౌకర్యాలు కల్పించి విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో ఈఏడాది గరుడోత్సవానికి భక్తులు భారీగా వచ్చారు. దాదాపు 2.70 లక్షల మందికి గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. వీరిలో రెండు లక్షల మంది వరకు గ్యాలరీల్లో ఉండి.. సకల సౌకర్యాలతో దర్శనం చేసుకున్నారు. మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లలో క్యూలైన్ల ద్వారా మరో 40 వేల మంది.. ఆలయం ముందు రీఫిల్లింగ్ ద్వారా మరో 30 వేల మందికి దర్శనం చేయించగలిగారు. 70 వేలకు పైగా భక్తులు 28 భారీ హెచ్‌డీ డిజిటల్ స్క్రీన్ల ద్వారా వాహనసేవను వీక్షించారు. ఇక, మూలవిరాట్టును కూడా 82,043 మంది దర్శించుకున్నారు. 3,53,185 లడ్డూలను భక్తులకు విక్రయించారు.

మాడవీధుల్లో సెక్టార్ల వారీగా..

భారీ భక్తజనానికి సమర్థంగా దర్శనం కల్పించడం వెనుక టీటీడీ ముందస్తు ప్రణాళిక ఉంది. మాడవీధుల్లోని 183 గ్యాలరీల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యాల పర్యవేక్షణకు సెక్టార్లవారీగా విభజించి 563 మంది కో-ఆర్డినేటర్లను.. మాడవీధుల్లో మరో 360 మంది సహాయక సిబ్బందిని అందుబాటులో నియమించారు. మరోవైపు తొలిరోజు నుంచీ టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు. గ్యాలరీల్లోని భక్తులను కలిసి వారి ఇబ్బందులు.. టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలు.. ఇంకా ఏం చేస్తే బాగుంటుందనే వివరాలను తెలుసుకున్నారు. ప్రతిరోజు ఉదయం వాహనసేవ పూర్తికాగానే భక్తుల ఫీడ్‌బ్యాక్‌పై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటూ వచ్చారు. దీనివల్ల గరుడసేవ రోజున గ్యాలరీల్లోని భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదు.

భారీగా బందోబస్తు

గరుడ సేవకు మూడున్నర లక్షల మందికిపైగా తిరుమలకు వచ్చారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రాఘవేంద్రస్వామి మఠం సమీపంలోని క్యూలైన్ల వద్ద జరిగిన తోపులాట మినహా గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ సమయాల్లోనూ ప్రశాంతంగా జరిగింది. వాహనాలను పక్కాగా పార్కింగ్ ప్రదేశాలకు పంపడం.. అదనంగా వచ్చిన వాటిని రింగ్‌రోడ్డులో ఆపేయడంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య ఎదురుకాలేదు. ఇలా డీఐజీ షేముషిబాజ్‌పాయ్ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ దాదాపు 7 వేల మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకలి అనే మాట వినిపించకుండా

గరుడసేవ కోసం 20 గంటలకుపైగా గ్యాలరీల్లోనే కూర్చున్న భక్తులకు అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందించారు. పాలు, కాఫీ, ఉప్మా, పొంగళి, సాంబారన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్, రెండు లక్షల పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు.. తర్వాత విజిటబుల్ కిచిడీ ఇచ్చారు. ఇలా 8.70 లక్షల ప్లేట్ల అన్నప్రసాదాలను 4 వేల మంది శ్రీవారిసేవలకు ద్వారా అందించారు. గ్యాలరీల్లోకి రాలేకపోయిన.. మూలవిరాట్టు దర్శనానికి క్యూలో ఉన్న భక్తులకూ అన్నప్రసాదాలు అందజేశారు.

సమష్టి కృషితో గరుడసేవ విజయవంతం : ఈవో

టీటీడీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో బ్రహ్మోత్సవాల్లో కీలకమైన గరుడవాహన సేవను విజయవంతంగా నిర్వహించామని ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని రాంభగీచా విశ్రాంతి భవనాల ముందు బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలు బాగా పనిచేశాయని అభినందించారు. ఆరోగ్య శాఖ మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో గ్యాలరీల్లోని భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహన సేవనూ గరుడ సేవలాగే భావించి సేవలు అందించాలని అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. గ్యాలరీల వద్ద మరిన్ని శాశ్వత మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం మాడవీధుల్లో మరో వందేళ్లకు సరిపడా మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గరుడ సేవలో క్యాటరింగ్ విభాగం చాలా బాగా పనిచేసిందని అభినందించారు. పోలీసుల సమన్వయంతో విజిలెన్స్ విభాగం పనిచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసిందన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'టైమ్స్' ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూకు ఏపీలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్- 2025లో ఎస్వీయూకు చోటు లభించింది. వీరు 18 అంశాల్లో ఎస్వీయూ ప్రగతిని పరిశీలించారు. బోధనలో 36.2, ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్‌లో 26.3, పారిశ్రామిక అనుసంధానంలో 25.6, అంతర్జాతీయ సంబంధాల్లో 29.2 శాతం మార్కులు సాధించింది. 1201-1500 మధ్య ర్యాంకును ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో ఎస్వీయూ మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితో ఈ గుర్తింపు సాధ్యమైందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత ఉన్నత గుర్తింపును సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

అవి చిరుత అడుగులు కాదు

బీట్ ఆఫీసర్ మహేశ్



రేసు కుక్క లేదా బావురు పిల్లి అడుగులుగా గుర్తించిన పాదముద్రలు

సదుం, అక్టోబరు 9: మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలో గల నాగలవాణి మొరవ వద్ద మంగళవారం రాత్రి చిరుత పులి సంచరించినట్లు వచ్చిన వదంతులపై అటవీ శాఖ నంజంపేట బీట్ సిబ్బంది బుధవారం విచారణ చేపట్టారు. చిరుత సంచరించినట్లు వదంతులు వచ్చిన ప్రాంతాన్ని బీట్ ఆఫీసర్ మహేశ్ తన సిబ్బందితో బుధవారం పరిశీలించారు. జంతువు అడుగులు గుర్తించిన వారు అవి చిరుత పులి అడుగులు కావని, రేసు కుక్క లేదా బలమైన బావురు పిల్లి అడుగులను గ్రామస్థులకు తెలియజేశారు. చిరుత పులి సంచరించినట్లు వచ్చిన వదంతులను నమ్మాల్సిన అవసరం లేదని వారు గ్రామస్థులకు భరోసా కల్పించారు.

ట్రాన్స్‌కో ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు, అక్టోబరు 9 : చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్‌ను నియమించారు.తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో వాణిజ్య విభాగ జీఎంగా ఉన్న ఇస్మాయిల్ ఎస్ఈగా నియమితులయ్యారు.

హడలెత్తించిన చెరకు ట్రాక్టర్



పుత్తూరు అర్బన్, అక్టోబరు 9: పట్టణంలో పరిమితికి మించి చెరకు లోడ్ ట్రాక్టర్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. బుధవారం ఉదయం 11.40 గంటల ప్రాంతంలో పుత్తూరు - చిత్తూరు రహదారి రద్దీగా ఉంది. ఈ క్రమంలో ఎస్ఆర్‌పురం సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి అధిక లోడ్‌లో ట్రాక్టర్ ముందు టైర్లు పైకి లేచినట్టు ప్రయాణించడంతో స్థానికులు బిత్తరపోయారు. ఎక్కడ వాహనం బోల్తా కొడుతుందోనని భయభ్రాంతులకు గురయ్యారు.

నలుగురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 11 దుంగల స్వాధీనం

మంగళం, అక్టోబరు 9: టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు సురేష్‌బాబు, విశ్వనాథ్‌ల బృందం చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సంతపేట బీట్ పరిధిలో కాజూరు వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పట్టుకుని విచారించగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు బయటపడింది. వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అస్పియా హత్యపై దుష్ప్రచారం జగన్ పత్రికపై కేసు నమోదు

పుంగనూరు, అక్టోబరు 9:చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి అస్పియా హత్యకు సంబంధించి జగన్ దినపత్రిక, జగన్ టీవీ చానల్‌లో అసత్య ప్రచారం చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు అబ్బాస్ ఫిర్యాదు మేరకు పుంగనూరు పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. అస్పియాపై అత్యాచారం చేసి హత్య చేశారంటూ ప్రచారం చేసిన ఆ పత్రిక, ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అబ్బాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత చిత్తూరు



కప్పు అందుకుంటున్న చిత్తూరు జట్టు క్రీడాకారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. చిత్తూరు ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ, తూర్పు గోదావరి తృతీయ స్థానాల్లో నిలిచాయి. రాష్ట్రస్థాయి విజేతలు తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు నాగరాజు, నరేశ్‌బాబు తెలిపారు. ఫైనల్స్‌లో చిత్తూరు జట్టు శ్రీకాకుళం జట్టుతో పోరాడి 39-21 పాయింట్ల తేడాతో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈ జట్టులో మదనపల్లె మండలం సీటీఎం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. గెలుపొందిన జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత, జడ్పీ హెచ్ఎం ఆంజినేయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్, ఉపాధ్యాయులు గిరిధర్‌నాయక్, ఉమర్‌బాషా అభినందించారు.

ఏనుగుల దాడిలో ఆవు మృతి

- వరి పంటలను ధ్వంసం చేసిన గజరాజులు



మృతి చెందిన పాడి ఆవును పరిశీలిస్తున్న ఎఫ్ఎస్‌వో

కల్లూరు, అక్టోబర్ 9: పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు బుధవారం వేకువజామున ఓ పాడి ఆవుపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద చోటు చేసుకుంది. తూర్పు అటవీ విభాగం సెక్షన్ అధికారి మహమ్మద్ షఫి తెలిపిన వివరాలు ఇలా... బుధవారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో 14 ఏనుగుల గుంపు కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకుంది. రైతు కుమార్‌రెడ్డికి చెందిన పాడి ఆవు మామిడితోటలో ఒంటరిగా ఉండగా దాడి చేశాయి. దీంతో పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందగా బాధిత రైతు కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పాడి ఆవుకు కల్లూరు పశువైద్యాధికారి మునిచంద్ర పోస్టుమార్టం నిర్వహించారు. ఇదే రైతుకు చెందిన ఎకరా వరి పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో మృతి చెందిన పాడి ఆవుకు, వరి పంటలకు నష్ట పరిహారం అందేవిధంగా చూస్తామని, ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని సెక్షన్ అధికారి తెలిపారు.

జగన్ పరివారంతోనే తిరుమల అపవిత్రం : బీజేపీ



జగన్, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డిలకు పిండప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ తదితరులు

పుంగనూరు, అక్టోబరు 9: కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూను అపవిత్రం చేశారంటూ మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డి చిత్రపటాలకు బీజేపీ నాయకులు బుధవారం పుంగనూరులో పిండప్రదానం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వంలో టీటీడీ ఛైర్మన్లు, ఈవో క్షమించరాని తప్పులు చేశారని దుయ్యబట్టారు.కమీషన్లకు కక్కుర్తి పడి రూ.322కు కిలో నెయ్యిని సామర్థ్యం లేని డెయిరీ నుంచి కొనుగోలు చేసి కల్తీలకు పాల్పడి ఆరోపించారు.వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని తెలియడంతో పుంగనూరులో జగన్, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి దిష్టి బొమ్మలను గత నెల 22వ తేదీ ఊరేగించి దహనం చేయడం జరిగిందన్నారు.17వ రోజైన బుధవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, టెంకాయలు కొట్టి, పిండ ప్రదాన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. దేవుడి కొండను అపవిత్రం చేసిన వారి పాపాలకు శిక్ష తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి హరిబాబు, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, మల్లికారాణి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుయాలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స



కోలుకున్న రోగితో రుయా వైద్య బృందం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 9: ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ చేరి ఆయాసంతో పాటు దగ్గులో రక్తం పడుతున్న మహిళకు అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని తిరుపతిలోని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. దీనిపై బుధవారం ఆయన రుయాస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. 'వెంకటగిరికి చెందిన రమణమ్మ(62) తీవ్రమైన ఆయాసం, దగ్గులో రక్తం పడుతూ ఉన్న పరిస్థితిలో రెండు వారాల కిందట రుయాస్పత్రికి వచ్చింది. ఊపిరితిత్తుల విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు ఆమెను పరీక్షించి అరుదైన ఫంగల్ బంతి సమస్య ఉందని గుర్తించారు. అప్పటికే ముదిరి గుండె వరకు వ్యాపించడంతో తక్షణమే శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాటు చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు కళ్యాణి రమ, రాధ, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి ఫంగల్ బంతిని తొలగించారు. అనంతరం రోగి పూర్తిగా కోలుకున్నారు' అని వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ క్లిష్టమైన సర్జరీ రుయాస్పత్రిలోనూ విజయవంతంగా చేస్తున్నామన్నారు. నిరుపేద రోగులు ఇక్కడి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పేరుతో మద్యం షాపులకు దరఖాస్తులు



దరఖాస్తు చేస్తున్న మహిళలు

చంద్రగిరి, అక్టోబరు 9: అదృష్టం వరిస్తుందనే ఆశతో కొందరు మద్యం షాపుల కోసం భార్య పేరుతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇద్దరు మహిళలు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి 17 షాపులకు గానూ బుధవారం సాయంత్రానికి 82 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర తెలిపారు. చంద్రగిరి మండలంలో 7 షాపులకు 46, పాకాల మండలం 5 షాపులకు 7, చిన్నగొట్టిగల్లు మండలం 3 షాపులకు 14, ఎర్రావారిపాళెం మండలం 2 షాపులకు 15 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

టెట్ పరీక్షకు 405 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 9: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు 405 మంది హాజరయ్యారు.జిల్లాలోని ఎస్వీసెట్, మదర్‌థెరిసా కళాశాలల్లో జరిగిన పరీక్షలకు 461మంది అభ్యర్థులకు గాను 56మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 230 మంది అభ్యర్థులకు గాను 198 మంది హాజరుకాగా, 32మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 231మంది అభ్యర్థులకు గాను 207 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

14న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా

చిత్తూరు, అక్టోబరు 9: చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ వద్ద ఈనెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీలు అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేస్తాయన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్రెంటిస్ ఐటీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో నేరుగా సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 90306 57957 నెంబరును సంప్రదించాలని కోరారు.

పద్మావతి వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),అక్టోబరు9: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు బి-ఒకేషనల్ - న్యూట్రీషన్ అండ్ హెల్త్ కేర్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అపెరల్ డిజైన్, బీఏ స్టాటిస్టిక్స్, సోషియల్ వర్క్, ఫైన్ ఆర్ట్స్‌లో పీజీ కోర్సులకు ఆసక్తి గల విద్యార్థుల నుంచీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్వో శ్రీరజని కోరారు. సమగ్ర వివరాల కోసం.. ఎస్పీఎంవీవీ.. వెబ్ సైట్ చూడాలని ఆమె ఒక ప్రకటనలో సూచించారు.

వేణుగోపాల స్వామికి బంగారు తాళి బొట్టు వితరణ



చౌడేపల్లె, అక్టోబర్9: ఎ.కొత్తకోట పంచాయతీ ఎస్.అగ్రహారంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి అర్చకులు అనంద స్వామి తన సొంత నిధులతో ఆలయానికి మరమ్మతులు చేయించారు. స్వామివారికి బంగారు తాళిబొట్టు తయారు చేయించి, గ్రామంలో ఊరేగించి స్వామి వారికి సమర్పించారు.

కుప్పం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక చొరవ : కడా పీవో

కుప్పం, అక్టోబరు 9: కుప్పం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కడా పీవో వికాస్‌మర్మత్ తెలిపారు. కుప్పంలో వంద రోజులుగా జరిగిన అభివృద్ధిపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పానికి 17 డివిజన్ స్థాయి అధికారులను నియమించారని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి, హౌసింగ్ సర్వే పూర్తిచేసి అర్హులకు అందజేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే మూడు ప్రాజెక్టులు ఎంవోయూ కుదుర్చుకున్నాయన్నారు. బెంగళూరుకు వలసలు వెళ్ళే వారికి కుప్పంలోనే ఉపాధి కల్పనకు కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రతి పంచాయతీలోనూ ప్రజా దర్బార్ నిర్వహించి, ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరిస్తామని వివరించారు. చిరు వ్యాపారులకు రాయితీపై రుణాలు, డ్వాక్రా మహిళల దుకాణాలకు సరకులు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఈజీ మార్ట్ తదితర కార్యక్రమాలుమ త్వరలో అమలు చేస్తామన్నారు.



పుంగనూరు మండలం చదళ్లలో సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన చౌడేశ్వరిదేవి

ఘనంగా శరన్నవరాత్రి పూజలు



కంబాలదేవులపల్లెలో సప్తమాతృక చౌడేశ్వరమ్మ - పలమనేరు పాతపేట కనకదుర్గ - సరస్వతీ అలంకారంలో సల్లాపురెమ్మ, కన్యకాపరమేశ్వరి

రామకుప్పం, అక్టోబరు 9: రామకుప్పం మండలం ఆనిగానూరులో దుర్గాదేవి అలంకారంలో, రామకుప్పంలో సరస్వతి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె సప్తమాతృక చౌడేశ్వరి ఆలయంలో దుర్గాదేవీ కుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

పలమనేరు : పలమనేరులోని కనకదుర్గాదేవి అలయంలోనూ, బసవేశ్వరస్వామి ఆలయంలోనూ అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో వున్న సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. బాటగంగమ్మ ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆల యం, దేవదొడ్డి అంకాళపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి. తీర్థం గ్రామంలో వున్న రామచంద్రస్వామి ఆలయంలో బుధవారం మోహినీ ఉత్సవం జరిగింది. ఉత్సవమూర్తులకు విశేషాలంకరణగావించి మాడవీధుల్లో ఊరేగించారు.

కల్లూరు: కల్లూరులో కొలువైన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవళంపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కాశీ విశాలాక్షి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. చిన్నపిల్లలు నృత్యప్రదర్శనలు ఇచ్చారు.

పుంగనూరు రూరల్ : చదళ్లలో కొలువుతీరిన చౌడేశ్వరిదేవి భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. వందలాది కుటుంబాల వారు తమ పిల్లలతో సరస్వతి కటాక్ష పూజలో పాల్గొన్నారు.

సోమల : పట్రపల్లెలో కన్యకాపరమేశ్వరిని సరస్వతీదేవి అలంకరణచేశారు. కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వి.కోట : వి.కోటలోని దుర్గమ్మ మీనాక్షిదేవిగా భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



రొంపిచెర్లలో ముత్యాలమ్మ-కందూరు కన్యకాపరమేశ్వరి - తీర్థంలో మోహినీ ఉత్సవం - పలమనేరు బసవేశ్వరాలయంలో - మీనాక్షిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ

15న మండల సమావేశం

గంగవరం, అక్టోబరు 9 : ఈనెల 15వ తేదీ గంగవరం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు హాజరుకావాలని ఆయన కోరారు.

వరద బాదితులకు అండగా సాయిమాతా ట్రస్ట్

కుప్పం, అక్టోబరు 9: విజయవాడ వరదల బాధితులకు కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ రథాన్ని పంపినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. విద్యార్థుల సహకారంలో 250 కుటుంబాలకు సరిపడా బియ్యం, పప్పులు, దుస్తులు, దుప్పట్లు ఇతర వంట సామగ్రిని సేకరించి బుధవారం ప్రత్యేక వాహనంలో పంపారు. వాహనాన్ని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్. మునిరత్నం చేతుల మీదుగా జెండా ఊపి విజయవాడకు పంపారు. కార్యక్రమంలో గాజులబాషా, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, డా.వెంకటేష్, కుప్పం డీఎం జయంతిశివమణి, షహీన్‌తాజ్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు టీడీపీ ఆర్థిక సాయం

శాంతిపురం, అక్టోబరు 9 : మండల పరిధిలోని 64పెద్దూరు పంచాయతీ టీడీపీ నేతలు విజయవాడ వరద బాధితులకు రూ.65,500లు ఆర్థిక సాయాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు సహకారంతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు బుధవారం కుప్పం పార్టీ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, నాయకులు విజయరామిరెడ్డి, పీవీ నాగరాజు, జయారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నేడు పాల కలశాల శోభాయాత్ర

వి.కోట, అక్టోబరు9: దుర్గాష్టమిని పురస్కరించుకుని గురువారం వి.కోటలో పాల కలశాల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి 3033 మంది మహిళలు పాల కలశాలతో పుర వీధుల మీదుగా దుర్గమ్మ ఆలయం వరకు ప్రదర్శన కొనసాగనుందన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి

కల్లూరు, అక్టోబర్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్ఎస్ఏ పీవో వెంకటరమణారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడా మైదానం అభివృద్ధి పనులను బుధవారం పీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన క్రీడా మైదానాలతోనే క్రీడాభివృద్ధి సాధ్యమని తెలిపారు. తరగతి గదుల పనులు పూర్తిచేసి వాడుకలోకి తీసుకురావాలని తెలిపారు. ఎంఈవో శిద్దరామయ్య, ఉపాధ్యాయులు రాజేంద్ర, సీఆర్పీ అష్రఫ్ ఉన్నారు.

నాయీబ్రాహ్మణ చైతన్య శక్తి కార్యవర్గం ఎన్నిక



వెంకటేశ్

పుంగనూరు రూరల్, అక్టోబరు 9: పట్టణంలోని నాయీబ్రాహ్మణ చైతన్య శక్తి కార్యవర్గం ఎన్నిక జరిగింది. బుధవారం స్థానిక కట్టమీద వెలసిన సద్గురు త్యాగరాజస్వామి ఆలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ నాయీబాహ్మణ చైతన్య శక్తి అధ్యక్షుడిగా వెంకటేష్, ట్రెజరర్‌గా పడిగల హేమంత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా నంజంపేట చంద్రన్న, గౌరవాధ్యక్షుడిగా సీతారామయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా భద్ర రమణను ఎన్నుకున్నారు.

సంతమిట్టలో తీరిన తాగునీటి సమస్య

రామకుప్పం, అక్టోబరు 9: విజలాపురం శివార్లలోని సంతమిట్ట ప్రాంతంలో ఎట్టకేలకు తాగునీటి సమస్య తీరింది. సంతమిట్టలో రెండేళ్ళుగా నెలకొన్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టరు సుమిత్‌కుమార్‌లకు ఇటీవల టీడీపీ నేతలు వినతి పత్రాలు ఇచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టరు అక్కడ బోరు తవ్వకానికి రూ.2లక్షలు మంజూరు చేశారు. బుధవారం టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కుమార్, మాజీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, ఎంపీటీసీ వెంకట్రామగౌడు తదితరులు బోరుకు మోటారు బిగించారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

గంగవరం, అక్టోబరు 9 : తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు జాతీయ స్థాయి పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. వందకుపైగా పద్యాలు చెప్పగలిగిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు 9346249011 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీన వార్షికోత్సవం రోజున పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 9 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ పంపిణీ చేశారు. గర్భిణులు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శాంతమ్మ, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

రొంపిచెర్ల,అక్టోబరు9: టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్, ఐటీ రంగాలకు సంబంధించి 12 రోజులపాటు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తున్నామని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టరు సరళ తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె సచివాలయం రైతు సేవా కేంద్రంలో విద్యార్థుల కెరీర్ ఎదుగుదలకు గల అవకాశాలు, నైపుణ్యాలు మెరుగుపరచుకోవడానికి తీసుకోవాల్సిన మెలకువలు, పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి అవగాహన తరగతులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం జీసీడీవో ఇంద్రాణి పర్యవేక్షించారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌కు సన్మానం



శాంతిపురం, అక్టోబరు 9 : ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నంను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కుప్పం నుంచి సి.బండపల్లె మీదుగా గెసికపల్లె, సాతు, రాళ్ళబూదుగూరు ప్రభుత్వ కళాశాల కలుపుకొని కనమలదొడ్డి మీదుగా మళ్లీ కుప్పం వెళ్లేటట్లు ఆర్టీసీ బస్సు నడిపితే విద్యార్థులకు, ప్రయాణికులకు వీలుగా ఉంటుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి బస్సు నడిపేం దుకు చొరవచూపుతామని పీఎస్ మునిరత్నం వారికి తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, నాయకులు విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన వాలీబాల్ కోచ్

పుంగనూరు, అక్టోబరు 9: పుంగనూరులో స్టేడియం ఏర్పాటుపై శాప్ ఛైర్మన్ రవినాయుడును కలిసినట్లు నేషనల్ వాలీబాల్ కోచ్ సుకుమార్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో క్రీడాస్టేడియం ఏర్పాటుకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసి స్థలం కూడా చూపారన్నారు. కానీ గత ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందని, మీ హయాంలో పుంగనూరులో స్టేడియం నిర్మించాలని కోరారు.

పలమనేరులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

పలమనేరు, అక్టోబరు 9 : పలమనేరులో వీధి దీపాల గురించి పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జాతీయరహదారి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు కొన్ని వెలగడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లోను, పలు వీధుల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో సైతం పలువురు కౌన్సిలర్లు తమ పరిధిలోని వీధుల్లో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో వీధి దీపాలు మిగులు లేనందున వీధి దీపాలు సకాలంలో వేయలేదని అధికారులు సమాధానం కూడా ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు కొనుగోలు చేసి వెలగని వీధి దీపాలు మార్చి కొత్త దీపాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

గరుడుడిపై నారాయణుడి వైభవం

● పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే థామస్


గరుడ వాహనంపై విశేష అలంకరణలో నారాయణుడు - పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 9: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నారాయణుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఉత్సవరులైన స్వామివారు పల్లకిలో మోహిని అవతారం, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణులకు కల్యాణోత్సవం పూజలు చేశారు. అనంతరం రాత్రి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ఆలయట్రస్టీ కె.ఎస్.వాసు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. తర్వాత గరుడ వాహనంపై నారాయణుడిని పురవీధుల్లో ఊరేగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేని ఆహ్వానిస్తున్న ఈవో తదితరులు

నగరి, అక్టోబరు 9: నగరి మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్‌కండ్రిగలో ఉన్న దేశమ్మ ఆలయంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ని ఆలయ ఈవో లత ఆహ్వానించారు. నూతన ఈవోగా నియమించబడిన లత బుధవారం ఎమ్మెల్యేని కలసి ఆహ్వాన పత్రాన్ని అందజేసి, ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. పురోహితులు పురుషోత్తం, మదనమోహన్, వెంకటాచలం నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు నగరిలో పీజీఆర్ఎస్

నగరి, అక్టోబరు 9: నగరి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరి మున్సిపాలిటీ, నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు ఈ వేదికలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ఇద్దరి అరెస్టు, మరొకరు పరార్

యాదమరి, అక్టోబరు 9: మండలంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో వరిగపల్లె సమీపంలో బుధవారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు యాదమరి ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... సుమారు రూ.80 వేలు విలువ చేసే 20 కేసుల మద్యాన్ని, టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నలుగురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

● 11 దుంగల స్వాధీనం

మంగళం, అక్టోబరు 9: టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు సురేష్‌బాబు, విశ్వనాథ్‌ల బృందం చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సంతపేట బీట్ పరిధిలో కాజూరు వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పట్టుకుని విచారించగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు బయటపడింది. వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోసగాడిపై ఫిర్యాదు

వెదురుకుప్పం, అక్టోబరు 9: అగరబత్తీలు అమ్ముకుంటూ కార్వేటినగరం మండలంలో పలువురిని బురిడీ కొట్టించిన ఓ యువకుడిపై బుధవారం బాధితులు కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని తిరుత్తణికి చెందిన ప్రవీణ్ గ్రామాల్లో అగరబత్తీలను అమ్ముకుంటూ వాటితో పాటు కూపన్లు ఇచ్చాడు. మీకు లక్కీ డ్రాలో టీవీ, ఫ్రిడ్జ్, కుక్కర్లు ఇతరత్రా సామాన్లు గిఫ్టుగా వచ్చాయని, రవాణా నిమిత్తం రూ.6100 చెల్లించాలని పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడు. తర్వాత వెయ్యి రూపాయల విలువ చేసే సామగ్రిని ఇచ్చి మోసం చేసినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సుమారు లక్ష రూపాయలను వసూలు చేసినట్లు సమాచారం.


మహిషాసుర మర్దినిగా గిరింపేట దుర్గాంబ - కాత్యాయనిగా మరగదాంబిక - గంగాధరనెల్లూరులో సరస్వతీదేవిగా అల్లియెల్లమ్మ - బంగారుపాళ్యంలో సరస్వతీదేవిగా ముత్యాలమ్మ - ఆర్కేవీబీపేటలో ఆరిమాని గంగమ్మకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే థామస్

మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన గిరింపేట దుర్గాంబ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 9: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిషాసురమర్దినిగా గిరింపేట దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. తేనబండ గిరింపేట చౌడేశ్వరిమాత, బ్రాహ్మణవీధి వాసవి కన్యకా పరమేశ్వరి, కట్టమంచి షిరిడి సాయిబాబ, పొన్నియమ్మ, ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆలయాల్లో అమ్మవారు సరస్వతిదేవిగా, సంతపేట కనకదుర్గ రాజరాజేశ్వరి దేవి, తేనబండ ముత్యాలమ్మ సంతానలక్ష్మిగా, అంకాలపరమేశ్వరి అమ్మవారు కంచికామాక్షిగా, బీజెడ్ హైస్కూల్ ఆవరణలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులను అలరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఉత్సవ నిర్వాహకులు అందజేశారు.

కాత్యాయనిదేవిగా మరగదాంబిక

ఐరాల(కాణిపాకం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మరగదాంబిక అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. ఈవో గురుప్రసాద్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

● గుడిపాల మండలంలోని కందగిరికొండలో దుర్గమ్మ.. మహిషాసుర మర్ధినిగా, పల్లూరులో సరస్వతీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.

● నింద్ర మండలంలోని కేఆర్‌పాలెంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం: కార్వేటినగరంలో బంగారమ్మ.. సరస్వతీదేవిగా, పాత దేరాకండ్రిగలోని నైనేరమ్మ సరస్వతిదేవిగా, వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు.

● బంగారుపాళ్యంలో ముత్యాలమ్మ.. సరస్వతీదేవీగా భక్తులను దర్శనమిచ్చారు. వజ్రాలపురంలో వెలిసిన బోయకొండ గంగమ్మ సరస్వతీదేవీగా భక్తులకు కనువిందు చేశారు.

● గంగాధరనెల్లూరులో అల్లియెల్లమ్మ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల అందజేత

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో ఆరిమాని గంగమ్మ ఆలయంలోని అమ్మవారికి బుధవారం గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పట్టు వస్త్రాలను అందించారు. గ్రామానికి చెందిన అన్నారెడ్డి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్న, టీడీపీ అధ్యక్షులు చెంగల్రాయయాదవ్, టీడీపీ నాయకులు బీగాల రమేష్, మాదిరాజు జనార్ధన్‌రాజు, చెంగల్రాయులు, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

● శ్రీరంగరాజుపురం మండలం ఆరిమాకులపల్లెలో ఆరిమాని గంగమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు జయశంకర్ నాయుడు, నేతలు రాజశేఖర్ నాయుడు, గుండయ్య, బాలు, జయచంద్ర నాయుడు, కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, సిద్దయ్యశెట్టి, జలంధర్ నాయుడు, ఎన్.కుమార్, నరేష్, వెంకటాచలం, సూరిరెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం


రోడ్డుపై అడ్డంగా గోడ కడుతున్న దృశ్యం

పెనుమూరు, అక్టోబరు 9: ఎన్నో ఏళ్లుగా ప్రజలు నడుస్తున్న దారికి అడ్డంగా గోడ నిర్మించారు. పెనుమూరు మండలం కలవగుంటలో ఓ వైసీపీ నాయకుడు దారికి అడ్డంగా బుధవారం గోడ నిర్మించారు. ఈ విషయంపై స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లి పరిశీలించారు. దారికి అడ్డంగా గోడ కట్టడాన్ని ఆపాలని ఆయన సూచించారు. సాయంత్రం 5 గంటల వరకు ఆపి అనంతరం మళ్లీ గోడ కట్టారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన బుల్లెట్ రవి



పెనుమూరు, అక్టోబరు 9: తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్వరగౌడ్‌ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుల్లెట్ రవి బుధవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షులు నాగరాజుగౌడ్, తిరుపతి మాజీ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు యలపల్లి గోపి, చిత్తూరు జిల్లా సీనియర్ నాయకుడు పరదేశి పాల్గొన్నారు.

కృష్ణాపురం జలాశయం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డి



వెదురుకుప్పం, అక్టోబరు 9: కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పుల్లయ్య బుధవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా నాగరాజురెడ్డి, కార్యదర్శిగా మురుగేష్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

అన్నదానం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 9: గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో సత్యసాయి సేవాసమితి బుధవారం ప్రభుత్వాస్పత్రి, గాంధీ సెంటర్, దర్గా, లెప్రసీ కాలనీల్లోని పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

సౌభాగ్య సంతాన ప్రాప్తియాగం


చండీమాతకు పూజలు చేస్తున్న ప్రతిమ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 9: చిత్తూరు నియోజక వర్గంలోని మహిళలు సుఖసంతోషాలు, సౌభాగ్యం, సంతానంతో రాష్ట్ర ప్రజలు విలసిల్లాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ బుధవారం నవచండీ యాగంలో పూజలు చేశారు. సంతపేట జీజేఎం ఫంక్షన్ హాలులో మరో రెండు రోజులపాటు చండీయాగం నిర్వహించనున్నారు.

బృందావనంలో పారిశుధ్య చర్యలు


తిరుమలరాజుపురం బృందావనాన్ని శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాలసముద్రం, అక్టోబరు 9: తిరుమలరాజుపురం బృందావనాన్ని బుధవారం పంచాయతీ అధికారులు, గ్రీన్‌అంబాసిడర్లు శుభ్రం చేయించారు. నిరుపయోగంగా బృందావనం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం వార్త ప్రచురించడంతో ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి హరి, గ్రీన్‌అంబాసిడర్లతో బృందావనం ఆవరణలో ఉన్న చెత్త నుంచి ఎరువులు తయారు చేసే తొట్టెలను, పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామాల్లోని తడిపొడి చెత్తను సేకరించి ఎరువు తయారు చేస్తామని వారు తెలిపారు.

హనుమంత వాహనంపై వెంకటేశ్వరుడి విహారం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 9: నగరంలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు హనుమంత, గజ వాహనాల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేసారు. కోదండరామాలయంలో స్వామి వారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల ఈవోలు, ట్రస్టీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

బంగారుపాళ్యం, అక్టోబరు 9: అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కొదలమడుగు, బండ్లదొడ్డి, కీరమంద, జయంతి, వేపనపల్లె గ్రామాల ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీ స్వాధీనం



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 9: కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలుతున్న గ్రానైట్ లారీని బుధవారం కాణిపాకం ఎస్ఐ ధరణీదర స్వాధీనం చేసుకున్నారు. ఉదయం కాణిపాకం పరిధిలో రోడ్డుపై ఎస్ఐ సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ లారీ అటుగా వచ్చింది. లారీని ఆపి గ్రానైట్ సరఫరాకు సంబంధించిన పత్రాలను అడిగారు. డ్రైవర్ వాటిని చూపక పోవడంతో గ్రానైట్ లారీని స్వాధీనం చేసుకున్నారు.

ఈవో బాధ్యతల స్వీకరణ

వెదురుకుప్పం, అక్టోబరు 9: కార్వేటినగరం మేజర్ పంచాయతీ ఈవోగా నాగరత్నమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె బదిలీపై నాగలాపురం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మణి రేణిగుంటకు బదిలీపై వెళ్లారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయమందిస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, అక్టోబరు 9: వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లికి చెందిన దివ్యాంగుడు పెద్దబ్బరెడ్డికి బుధవారం జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న ఆర్థికసాయాన్ని అందజేశారు. ప్రమాదంలో గాయపడిన అతనికి కూటమి ప్రభుత్వంలో రూ.15వేలు పెన్షన్ వచ్చే వరకు ప్రతి నెల రూ.5వేలు ఇస్తామని, ఇప్పుడు మూడో నెల పంపిణీ చేశారు. టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, జనసేన నేతలు యతీశ్వర్‌రెడ్డి, సతీష్, హరి, మునిరత్నంశెట్టి పాల్గొన్నారు.

క్షూరికాపురంలో సిమెంటు రోడ్డుకు మోక్షం


కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు

విజయపురం, అక్టోబరు 9: మండలంలోని క్షూరికాపురంలో నగరి కనకమ్మసత్రం మెయిన్ రోడ్డు నుంచి బాలాజీ ఇంటి వరకు 100 మీటర్ల మేర సిమెంటు రోడ్డు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సహకారంతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, మరిన్ని వీధుల్లో కూడా సిమెంటు రోడ్డు వేస్తామని సర్పంచ్ శేఖర్ తెలిపారు.

బాల్య వివాహంపై సీడీపీవో విచారణ

వెదురుకుప్పం, అక్టోబరు 9: వెదురుకుప్పం మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికకు వివాహం జరిగినట్లు ఫిర్యాదు అందడంతో బుధవారం కార్వేటినగరం సీడీపీవో పద్మసునంద వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో విచారణ చేపట్టారు. దీనిపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని సీడీపీవో తెలిపారు.

ఎస్టీయూ నాయకుడి మృతికి నివాళి

వెదురుకుప్పం, అక్టోబరు 9: కార్వేటినగరం మండలం కలికిరి ఇండ్లుకు చెందిన ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కలికిరి పవన్‌కుమార్ రెడ్డి(42) మృతి చెందగా, బుధవారం ఆయన చిత్ర పటానికి ఆ శాఖ రాష్ట్ర నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

తవణంపల్లె, అక్టోబరు 9: నీటి వసతి ఉన్న రైతులు మల్బరీ సాగు చేసి పట్టు పురుగుల పెంపకం చేపడితే అధిక ఆదాయం సాధించవచ్చునని పట్టు పరిశ్రమ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్ముగం తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువమారేడుపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్ముగం మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తరబ్రాహ్మణపల్లెలో వరి పంటను వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.